

సత్యం
ప్రతి ఆకులో
ప్రతి కన్నీటి బిందువులో వుంటుంది.
క్షణక్షణమూ తెలుసుకోవాలి.


# అంతరంగయాత్ర

జె. కృష్ణమూర్తి బోధనలతో కూడిన ప్రచురణ

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA DEC.09 - MAR. 2010 Rs.2/- VOL. IV ISSUE 2


# మన నిత్యజీవితంలోని కార్యకలాపాలన్నీ మన నుంచి మనం దూరంగా పారిపోవడం కోసమే చేస్తుంటాం

ఒకరి ప్రశ్న: ఒంటరితనం అనేది అందరమూ ఎప్పుడో ఒకప్పుడు అనుభవిస్తూనే వుంటాం. అందులో వున్న బాధ, దానికి గల కారణాలు దాని మూలాలు ఎక్కడున్నదీ మనకు తెలుసు. అయితే, ఏకాంతత అంటే ఏమిటి? ఇదీ ఒంటరితనమూ వేరు వేరా?

**కృష్ణమూర్తి:** ప్రాణం వున్న ఒక మనిషిగా దేనిలోనూ – ఒక చిన్న బృందంలో గాని, ఒక దేశంలో గాని మీరు ఇమడ లేకపోయి నప్పుడు, మీ భార్యతో గాని, పిల్లలతో గాని, భర్తతో గాని పొసగనప్పుడు ఇతరులతో మీ సంబంధం తెగిపోతుంది. అదే ఒంటరితనం అనే బాధ. ఒక్కరమే అయిపోయామే అనే వేదన. అందరికీ దూరంగా ఏకాకయిపోయిన స్థితి అది. ఈ పరిస్థితి మీ అందరికీ తెలిసిన విషయమే.సరే, మీకు ఏకాంతత అంటే తెలుసునా? నేను ఒక్కడినే గదా వున్నాను అని మీరు అనుకోవచ్చు. కాని నిజంగా మీరు అలా వున్నారా?

ఏకాంతంగా వుండటం వేరు, ఒంటరితనం వేరు. అయితే ఒంటరితనాన్ని అర్థం చేసుకోకపోతే ఏకాంతతను అర్థం చేసుకోలేరు. ఒంటరితనం ఏమిటో మీకు తెలుసా? దాన్ని చాటుమాటుగా గమనించి వుంటారు. పరికించి వుంటారు. అయిష్టతతో చూసి వుంటారు. దానిని గురించి తెలుసుకోవాలంటే దానికి మీకు మధ్య ఏ అడ్డంకి లేకుండా,ముందుగానే ఏ అభిప్రాయానికి రాకుండా, ఏ అపోహలు, అంచనాలు లేకుండా సూటిగా దానితో సంభాషించాలి. భయపడుతూ కాకుండా స్వేచ్ఛతో దాని వద్దకు చేరాలి. ఒంటరితనాన్ని అర్థం చేసుకోవాలంటే ఏమాత్రం భయభావం లేకుండా దానిని సమీపించాలి. ఈ ఒంటరితనానికి కారణమేమిటో, దాని వ్రేళ్ళెక్కడున్నాయో నాకు తెలుసు అంటూ కనుక మీరు ఒంటరితనాన్ని సమీపిస్తే దానిని అర్థంచేసుకోలేరు. దాని వ్రేళ్ళెక్కడున్నాయో మీకు తెలుసా? బయట ఎక్కడో కూర్చుని అవి వున్న చోటిని గురించి వూహాపోహలు చేస్తుంటారు. ఒంటరితనపు ఆంతర్యంలో వున్నవిషయమేమిటో మీకు తెలుసా? దానిని గురించి వూరికే వర్ణించి చెప్తారు. మాట విషయం కాదు. అసలైన విషయం కాదు. దానిని అర్థం చేసుకోవాలంటే, ఆ ఒంటరితనం నుండి దూరంగా వెళ్ళిపోవాలని ఏమాత్రం అనుకోకుండా సమీపించాలి. ఒంటరితనం నుంచి దూరంగా వెళ్ళిపోవాలనే ఆలోచనే

☞ 2

# ఈ ప్రపంచంలో నేను ఎలా జీవించాలి?

**(గత సంచిక తరువాయి)**

ఆ మర్నాడు అతడు ఆతురతతో వచ్చాడు. అతడి కన్నులు శోధించి తీరాలనే వుత్సాహంతో వెలిగిపోతున్నాయి.

**అతడు:** మీకు అభ్యంతరం లేకపోతే ఈ ప్రపంచంలో నేను ఎలా జీవించాలి అనే ఈ ప్రశ్న లోకి ఇంకా లోతుగా వెళ్ళి చూడాలనుకుంటున్నాను. నిన్న మీరు విశదీకరించినది ఇప్పుడు నా మనసులో నా హృదయంలో బాగా అర్థమైంది–ఆదర్శాలకు బొత్తిగా ఏ ప్రాధాన్యమూ లేదని. దీనిని గురించి చాలా మధన పడ్డాను, ప్రయాస పడ్డాను అయితే ఆదర్శాల అల్పత్వాన్ని గ్రహించగలిగాను. మీరు అంటున్నది ఇదీ – ఏ ఆదర్శాలు, ఏ పలాయనాలు లేనప్పుడు ఉండేది గతం ఒక్కటే; 'నన్ను' తయారు చేసిన వేల నిన్నలు. అవునా? అందుచేత, నేను ఎలా జీవించాలి అనే ప్రశ్న నేను అడిగినప్పుడు నేను వేసిన ఆ ప్రశ్నే తప్పు ప్రశ్న. అంతే కాకుండా నా వ్యాఖ్యలో పరస్పర వైరుధ్యం వున్నది. ఎందుకంటే ఈ ప్రపంచాన్నీ 'నన్ను' పరస్పర వ్యతిరేక స్థానాల్లో నిలబెట్టాను. ఈ వైరుధ్యాన్నే జీవితం అని నేను అంటున్నాను. కాబట్టి, 'ఈ ప్రపంచంలో నేను ఎలా జీవించాలి' అనే ప్రశ్నను వేసినప్పుడు ఈ పరస్పర వైరుధ్యాన్ని బాగుపరచాలని, సమర్థించాలని, సరిదిద్దాలని మాత్రమే నేను ప్రయత్నిస్తున్నా నన్నమాట. ఎందుకంటే నాకు తెలిసినది ఇంతవరకే. ఇంతకంటే నాకింకేమీ తెలియదు.

**కృష్ణమూర్తి:** సరే. ఇప్పుడు మనముందు వున్న ప్రశ్న ఇదీ. గతంలోనే ఎప్పుడూ జీవిస్తూ వుండి తీరాలా, కార్యకలాపాలన్నీ గతంలో నుండే జనించాలా, సంబంధబాంధవ్యాలన్నీ గత కారణంగా వచ్చాయా, జీవితం అంటే గతం అందిచ్చిన సంక్లిష్టపూరితమైన స్మృతి

☞ 2

*(1వ పేజీ తరువాయి) . . .*

# మన నిత్యజీవితంలోని కార్యకలాపాలన్నీ మన నుంచి మనం దూరంగా పారిపోవడం కోసమే చేస్తుంటాం

ఒక రకమైన ఆంతరిక కొఱతను సూచిస్తుంది. మనం చేసే కార్యకలాపాలన్నీ కూడా తప్పించుకొని పోవడం కోసమే కదూ? ఒంటరిగా వున్నప్పుడు రేడియో అయినా పెడతారు. పూజలైనా చేస్తారు; లేదా అంటే గురువుల వెనకాల పరుగెత్తుతారు. వారి గురించి వీరి గురించి కబుర్లు చెప్పుకుంటారు. సినిమాలకో, గుర్రప్పందేలకో వెళతారు. అదీ. మీ నిత్యజీవితమంతా మీ నుండి మీరు దూరంగా వెళ్ళిపోవడంలోనే గడుపుతారు. అందుచేత మీకు ఈ పలాయనాలు చాలా ముఖ్యమైపోతాయి. ఈ పలాయనాలను గురించి, అవి మత్తుపానీయాలైనా, మహాదేవుడైనా వాటి గురించి వాదులాడుకుంటారు.అసలు సమస్య ఎలాగోలా తప్పించుకోవడం. రకరకాలైన పలాయన మార్గాలు మీ వద్ద వుంటాయి. ఇటువంటి మర్యాదస్తుల పలాయనాల ద్వారా అపరిమితమైన మానసిక హానిని మీకు మీరే చేసుకుంటున్నారు. ఇంకొకరు ప్రాపంచికమైన పలాయనాలతో సామాజిక హాని చేస్తుంటారు. అయితే, ఒంటరితనాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ పలాయనాలన్నీ ముందు ఆగిపోవాలి. ఎవరి బలవంతం వల్లనో కాదు. నిర్బంధం చేతనో కాదు. పలాయనంలో వున్న బూటకాన్ని చూడటం వలన ఆగిపోవాలి. అప్పుడు 'ఉన్నది'ని మీరు సూటిగా ఎదుర్కొని తలపడతారు. అసలు సమస్య అప్పుడు ఆరంభమవుతుంది.

ఒంటరితనం అంటే ఏమిటి? దానిని అర్థం చేసుకోవాలంటే దానికి ఒక పేరు పెట్టకూడదు. ఆ ఒక పేరు పెట్టడమే, ఆలోచన పాత జ్ఞాపకాలను తన కూడా తీసుకొని వచ్చి దీనితో జత చేయడమే ఒంటరితనాన్ని పెంచుతుంది. దీనితో మీరే ప్రయోగం చేసి చూసుకోండి. ఒంటరితనం అంటే ఏమిటో మీరు గ్రహించనంతవరకు దానిని గురించి ఏం చేసినా సరే అది మరొక రకమైన పలాయనమే అవుతుందని ఈ పలాయనాలన్నీ ఆపివేసినప్పుడు మీరే చూడగలుగుతారు. ఒంటరితనాన్ని అర్థం చేసుకోవడం ద్వారానే దానిని దాటుకొని ఆవలగా వెళ్ళగలుగుతారు.

ఏకాంతత అంటే అది పూర్తిగా మరోసమస్య. మనం అసలు ఎప్పుడూ ఒక్కరమే వుండనే వుండం. ఎప్పుడూ మనుష్యులతో పాటు వుంటాం. ఎప్పుడైనా ఒక్కరమే కాలినడకన వెళ్ళినప్పుడు తప్ప. ఆర్థిక, సామాజిక, వాతావరణ మొదలైన పరిసరాలకు సంబంధించిన ప్రభావాలన్నీ కలసి తయారు చేసిన ఒక మొత్తం ప్రక్రియకి ఫలితమే మనం. మనపైన ఇటువంటి ప్రభావాలున్నంత వరకు మనం ఏకాకులం కాదు. అనుభవాలు, పోగుచేసుకోవడం అనే ప్రక్రియ వున్నంతవరకు ఏకాంతత అనేది లేనే లేదు. సంకుచితమైన, మీకు మాత్రమే సంబంధించిన స్వంత కార్యకలాపాలలో మునిగిపోయి మిమ్మల్ని మీరు ఏకాకులుగా చేసుకున్నాము అని వూహించుకోవచ్చు. అయితే అది ఏకాంతత కాదు. ఏ ప్రభావాలూ లేనప్పుడు ఏకాంతత వుంటుంది. ఒక ప్రతి చర్య జరపడం వలన లభించేది కాదు ఏకాంతత. దానికి అదే ఒక క్రియ. ఒక సమస్య మన మీద పడినప్పుడో, ఒక వుత్తేజం పొందినప్పుడో జరిగే ప్రతిస్పందన కాదు ఇది. వేరుగా విడదీసుకొనడం వలన కలిగే సమస్య ఒంటరితనం. మన బాంధవ్యాలన్నింటిలోనూ మనం ఇలా వేరుగా విడదీసుకొని వుండాలని చూస్తాం. స్వ-స్వయం-నేను అనే దానిలోని సారాంశమే ఇది. నా పని, నా స్వభావం, నా విధులు, నా ఆస్తి, నా బాంధవ్యం. మనిషిలోని ఆలోచనలకు, అతడిపై గల ప్రభావాలకు ఫలితంగా జనించిన ఆలోచనా ప్రక్రియ విడదీసి, ఏకాకిత్వానికి దారి తీస్తుంది. ఒంటరితనాన్ని అర్థంచేసుకోవడం భౌతికవాదులు ఆడుకునే ఆట అనుకోకండి. మీలో ఖాళీతనము, నిరాశానిస్పృహలు వుండటం వలన ఏర్పడే ఆ అవ్యక్తమైన కొరత భావం మీ లోపల సలుపు పెడుతూ వున్నంత వరకు ఒంటరితనాన్ని మీరు అర్థం చేసుకో లేరు. ఏకాంతత వేరుపరచే ఏకాకితనం కాదు. ఒంటరితనానికి ప్రతికూలమైనదీ కాదు. అనుభవాలు, జ్ఞానమూ ఏవీ లేకుండా పోయినప్పుడు వుండే ఒక అస్తిత్వస్థితి ఏకాంతం. *(5 ఫిబ్రవరి 1950, మద్రాసు)*

*(1వ పేజీ తరువాయి) . . .*

# ఈ ప్రపంచంలో నేను ఎలా జీవించాలి?

సముదాయమా? మనకు తెలిసినది అంతా ఇంతే. వర్తమానాన్ని గతం సరిదిద్దడం. ఇక, భవిష్యత్తు అంటే వర్తమానం ద్వారా పనిచేస్తూ బయటకు వస్తున్న ఆ గతమే. అందుచేత గతము, వర్తమానము, భవిష్యత్తు అన్నీ గతమే. ఈ గతించినదానినే జీవించడము అని అంటున్నాము. మనసు అంటే గతం. మెదడు అంటే గతం. మనోభావాలు. స్పందనలు గతం. వీటిలోనుండి వస్తున్న చర్యలు తెలిసిన విషయం (జ్ఞాతం) జరువుతున్న ప్రత్యక్ష కార్యకలాపాలు. ఈ ప్రక్రియ అంతా కలిసి మీ జీవితం. మీ సమస్త సంబంధబాంధవ్యాలు,మీ సమస్త కార్యకలాపాలు. ఇవన్నీ మీకు తెలుసు. అందుచేత ఈ ప్రపంచంలో ఎలా జీవించాలి అని మీరు ప్రశ్నిస్తున్నప్పుడు మీరు అడుగుతున్నది కారాగారాల మార్పిడికోసం.

**ప్ర:** నేను అన్నది అది కాదు. నేను ఏమంటున్నానంటే-ఆలోచించడం, క్రియచేయడం అనే ఈ ప్రక్రియ అంతా కూడా వర్తమానం ద్వారా భవిష్యత్తులోకి గతం సాగిపోవడమే అని నేను చాలా స్పష్టంగా చూశాను. నాకు తెలిసినది అంతా ఇంతే. అదీ వాస్తవం. నేను చిక్కుకొని పోయిన ఈ చక్ర నిర్మాణంలో కనుక మార్పు తీసుకొని రాకపోతే నేను అందులోనే వుండిపోతాను. ఇప్పుడు ఇక్కడ అడగక తప్పని ప్రశ్న ఏమిటంటే - నేను మారడం ఎలా?

**కృ:** మతి చలించ కుండా ఈ ప్రపంచంలో ఆరోగ్యంగా జీవించాలంటే మనసులోను, హృదయంలోను సమూలమైన మార్పు వచ్చి తీరాలి.

**ప్ర:** అవును. మార్పు అంటే మీ అర్థం ఏమిటి? నేను ఏం చేసినా సరే అది గతపు కదలికే అవుతున్నప్పుడు, ఇక నేను మారడం ఎలా? నన్ను మార్చుకోవలసినది నేనే. ఇంకెవ్వరూ నన్ను మార్చలేరు. పైగా మారడం అంటే ఏమిటి అనేది నాకు బోధపడటం లేదు.

**కృ:** సరే 'ఈ ప్రపంచంలో నేను ఎలా జీవించాలి?' అనే ప్రశ్న ఇప్పుడు 'నేను మారడం ఎలా?' అనే ప్రశ్నగా అయింది. ఇక్కడ ఎలా అంటే ఒక పద్ధతి అని కాదు. అర్థం చేసుకోవడం కొరకు చేసే విచారణ. మార్పు అంటే ఏమిటి? మార్పు అనేది అసలు వున్నదా? సంపూర్ణమైన మార్పు విప్లవమూ జరిగిన తరువాత మాత్రమే మార్పు అనేది అసలు వున్నదా అనే ప్రశ్న మనం వేయాలా? ఈ మాటకి అర్థం ఏమిటో మళ్ళీ ఒకసారి చూద్దాం. ఉన్నదాని నుండి మరొక భిన్నమైన దానికి జరిగే కదలిక-చలనం అని మార్పు అనే మాటలో వున్న అర్థం. ఈ భిన్నమైనది కేవలం ముందు వున్నదానికి వ్యతిరేకమైనదా లేదా అది పూర్తిగా మరో విభిన్న స్థాయికి చెందినదా? అది కనుక కేవలం వ్యతిరిక్తమైనది మాత్రమే అయితే అప్పుడందులో భిన్నత్వం ఏమాత్రం వుండదు. ఎందుకంటే ఈ వ్యతిరేకాలు అన్నీ పరస్పరాశ్రితాలు. వేడి-

☞ 3

(2వ పేజీ తరువాయి) . . .

## ఈ ప్రపంచంలో నేను ఎలా జీవించాలి?

శీతలం, ఎత్తు-లోతు లాగా. వ్యతిరిక్తమైనది దానికి వ్యతిరేకమైనదానిలోపలే వుంటుంది; దాని చేత నిర్ణయించబడుతుంది, తారతమ్యాలు పోల్చిచూడటం ద్వారానే దానికి ఉనికి ఏర్పడుతుంది. ఈ సాపేక్షికమైనవి, అంటే పోల్చిచూడగలిగిన విషయాలు ఒకే గుణాన్ని వేరు వేరు పరిమాణాలలో (కొలతలో) కలిగి వుంటాయి. అందుచేత వాటిలో సారూప్యత వుంటుంది. కాబట్టి వ్యతిరేకమైన దానిగా మార్పు చెందడం మార్పు కానే కాదు. విభిన్నమైనదిగా పైకి కనబడుతున్న దాని వైపు వెళుతున్నప్పుడు నిజంగానే మనం ఏదో చేసేస్తున్నాం అనే భావం మనలో కలిగినా అదంతా వట్టి భ్రాంతి.

**ప్ర:** ఇది నేను స్థిమితంగా హరాయించుకోవాలి.

**కృ:** అయితే ఇప్పుడు మన చింత దేని గురించి? గతంతో సంబంధం లేని ఒక పూర్తిగా సరికొత్తదైన సక్రమ స్థితి ఆవిర్భావం మనలో జరగడం సాధ్యమేనా? ఈ విచారణలో గతం ప్రస్తావన అనవసరం. దాని స్థానం అత్యల్పం. ఎందుకంటే ఆ నవ్య నూతనమైన క్రమతలో ఇది అసంగతం.

**ప్ర:** గతం చాలా అల్పమైనదనీ, దాని ప్రసక్తి అనవసరమూ, అసంగతమూ అని ఎలా అంటారు? ఇంతసేపూ మనం అసలు ప్రశ్న గతమే అని అంటూ వచ్చాం. ఇప్పుడు మీరు గతం అప్రస్తుతం అని అంటున్నారు.

**కృ:** గతవేం మన ఏకైక సమస్యలా కనబడుతున్నది. ఎందుకంటే అది ఒక్కటే మన మనసుల్లో హృదయాల్లో తిష్ట వేసుకొని కూర్చున్నది. మనకి అదొక్కటే ముఖ్యం. అయితే ఎందుకని మనం దానికి ప్రాధాన్యత ఇస్తున్నాం? ఈ చిన్న నీమ ఎందుకని అంత గొప్ప ప్రాముఖ్యత పొందింది? మీరు పూర్తిగా అందులోనే మునిగిపోతే, ఆ సొంతంగా దానికే నిబద్ధమై పోతే అప్పుడిక మార్పు సవ్వడిని మీరు వినవే లేరు. అలా సంపూర్ణంగా నిబద్ధమై పోకుండా వున్న మనిషి మాత్రమే వినగలుగుతాడు, విచారణ చేయ గలుగుతాడు, ప్రశ్నించగలుగుతాడు. అప్పుడు మాత్రమే ఈ చిన్న నీమ ఎంత అప్రధానమైనదో అతడు చూడగలుగుతాడు. అందుచేత, మీరు అందులో పూర్తిగా మునిగిపోయి వున్నారా లేక మీ తలనీటికి పైగా వున్నదా? మీ శిరస్సు కనుక నీటి వుపరితలం పైన వుంటే ఈ స్వల్ప విషయం ఎంత అప్రధానమో మీరే చూడగలుగుతారు. అప్పుడు చుట్టూ తలతిప్పి చూసే అవకాశం మీకుంటుంది. ఎంత లోతుల దాకా మునిగిపోయి వున్నారు మీరు? దీనికి సమాధానం మీరు తప్ప మరెవరూ చెప్పలేరు. ఈ ప్రశ్నను అడగడం లోనే అడుగుతూ వుంటేనే విడుదల లభించేస్తుంది. అందుచేత భయపడటం జరగదు. అప్పుడు మీ దృష్టి పథం విశాలమవుతుంది. గతపు పద్ధతి, ఆ తీరుతెన్నులు మీ గొంతు మీద కదలకుండా కూర్చున్నప్పుడు మీరు నోరెత్తరు. ఒప్పుకునేస్తారు. తల ఒంచుతారు. అనుసరిస్తారు. నమ్మేస్తారు. ఇది స్వేచ్ఛా స్వాతంత్ర్యం కాదు అనే స్పృహ కలిగినప్పుడు మాత్రమే అందులో నుండి బయటపడటం ఆరంభిస్తారు. అందుచేత మళ్ళీ ప్రశ్నిస్తున్నాను. మార్పు అంటే ఏమిటి? విప్లవం అంటే ఏమిటి? మార్పు అంటే తెలిసిన దాని (జ్ఞాతం) లో నుండి తెలిసినదాని (జ్ఞాతం) లోనికి కదిలిపోవడం కాదు. రాజకీయ విప్లవాలన్నీ ఇటువంటివే. మనం ఇప్పుడు మాట్లాడు కుంటున్నది ఇటువంటి మార్పు గురించి కాదు. దుర్మార్గుడి స్థితి నుండి మహాత్ముడి స్థితికి వృద్ధి చెందడం అంటే ఒక భ్రాంతి నుండి మరో భ్రాంతికి సాగిపోవడం. కాబట్టి దీని నుండి దానికి సాగిపోయే చలనం అయినటువంటి ఆ మార్పును మనం వదిలేశాం.

**ప్ర:** ఇది నిజంగా నాకు అర్థమైందా? నాలో కోపం. హింస, భయము జనించినప్పుడు నేను ఏం చేయాలి? వాటిని స్వేచ్ఛగా రాజ్యం ఏలనీయాలా? వాటితో నేను ఎలా వ్యవహరించాలి? అక్కడ మార్పు తప్పక రావాలి. లేనట్లయితే మునుపు ఎలా వున్నానో అలాగే మిగిలిపోతాను.

**కృ:** ఈ విషయాలను వాటికి వ్యతిరేకమైన వాటితో జయించలేమని మీకు బాగా స్పష్టంగా తెలిసిపోయిందా? అలా అయితే కనుక, మీ వద్ద వున్నది కేవలం ఆ హింస, ఆ ఈర్ష్య, ఆ కోపము, ఆ అత్యాశ. ఈ ఉద్రేకాలు ఒక సవాలును ఎదుర్కొన్నప్పుడు కలిగిన ఫలితం. కలగగానే దానికి పేరు పెడతాం. ఆ ఉద్వేగ భావానికి ఈ రకంగా ఒక పేరు పెట్టడం వలన అది మళ్ళీ తన పాత నమూనా లోనే స్థిరపడిపోతుంది. ఈ పేరు కనుక మీరు పెట్టకపోతే, అంటే అర్థం- అది మీది, మీకు చెందినది అని మీరు గుర్తించకపోతే, అప్పుడు ఆ మనోభావం కొత్తగా వుంటుంది. దానంతట అదే నిష్క్రమిస్తుంది. పేరు పెట్టడం వలన అది బాగా బలం పుంజుకుంటుంది. తెగకుండా కొనసాగిపోతుంది. ఇదంతా కూడా ఆలోచనా ప్రక్రియ.

**ప్ర:** ఎటూ కదలలేని ఒక మూలకు నన్ను తోసేశారు. అక్కడ అసలు వాస్తవంలో నేను ఏమిటో అది చూస్తున్నాను. నేను ఎంత అల్పుడినో కూడా చూస్తున్నాడు. ఇక్కడి నుండి ఇక ఎక్కడికి?

**కృ:** నేను ఏమిటో ఆ దాని నుండి చేసే ఎటువంటి కదలిక అయినా సరే ఆ వున్న నేనును ఇంకా బలంగా తయారు చేస్తుంది. అందుచేత, మార్పు అంటే బొత్తిగా ఏ కదలికా లేకుండా వుండటం. మార్పును తిరస్కరించడమే మార్పు. అప్పుడు మాత్రమే ఈ ప్రశ్నను నేను అడగగలుగుతాను. మార్పు అనేది అసలు వున్నదా? ఆలోచనల సమస్తమైన కదలికలు అంతరించినప్పుడు మాత్రమే ఈ ప్రశ్న వేయగలుగుతాం. 'మార్పుకానిది' అనే సౌందర్యం కొరకు ఆలోచనను తిరస్కరించాలి. ఉన్నది నుండి దూరంగా వెళ్ళిపోయే సమస్త ఆలోచనా కదలికలను నిశ్శేషంగా కాదనడం లోనే 'ఉన్నది' అంతరిస్తుంది.

*('అర్జెన్సీ ఆఫ్ చేంజ్' నుండి)*

*(పుటలు 27-38)*

## జీవితంలో ఆనందం

### (గత సంచిక తరువాయి)

**అయితే,** విజయము లేదా సాఫల్యమంటూ అసలు ఏదైనా వున్నదా? లేక అది ఒక భావనయేనా? ఆ భావన వెంటదవిలి మనిషి దానిని అందుకొన ప్రయత్నిస్తున్నాడా? మీరొక చోటికి వచ్చి చేరిన క్షణమందే మరికొంత దూరంలో దానికింకా ముందు, మీరు పోయి చేరుకోవలసిన చోటు మరియొకటి కనిపిస్తుంది. ఇట్లా దీని కంతముండదు. ఏ దిశలోనైనా సరే మీరు సఫలత పొందడంకోసం ప్రయత్నిస్తూ వున్నంతకాలం మీలో ఘర్షణ, పెనుగులాట, పోరాటము తప్పవు. ఇది నిజంకాదా? మీరొక చోటికి వచ్చి చేరుకొన్నా, మీకు విశ్రాంతి ఉండదు. కారణమేమంటే, మీరింకా పైపైకి పోగోరుతారు. ఇంకా ఎక్కువెక్కువగా వేటివేటినో పొందగోరుతారు. ఏమి, మీకు అర్థమవుతున్నదా? సఫలత కోసం ప్రయత్నం చేయడమంటే ఇంకా ఎక్కువెక్కువగా కావాలని కోరుకోవడం. ఈ విధంగా ఎల్లప్పుడు ఇంకా ఎక్కువ కావాలి, ఇంకా ఎక్కువ కావాలి అని కోరుకొంటూ వుండే మనస్సు తెలివి గల మనస్సుకాదు. అది మధ్యమమైనది, తెలివి తక్కువది. కారణమేమంటే, ఇంకా ఎక్కువెక్కువగా కావాలని కోరుకొనే కోరికలో అంతర్నిహితమై సంఘ నిర్దిష్ట మార్గమున జరిగెడి

(*3వ పేజీ తరువాయి*) . . .

# జీవితంలో ఆనందం

నిరంతర ప్రయత్నము, నిరంతర సంఘర్షణము చేరి వుంటుంది.

ఇంతకు సంతుష్టి అంటేయేమిటి? అసంతుష్టి అంటే ఏమిటి. అసంతుష్టి అంటే అధికం కోసం సంఘర్షణ - అంటేఇంకా ఎక్కువెక్కువగా కావాలని,అందుకోసం ప్రయత్నించడం, పెనుగులాడడం. సంతుష్టి అంటే ఆ సంఘర్షణ, ఆ పెనుగులాట అంతమవడం. అయితే,అధికం కోసం సంఘర్షణ యెట్లు జరుగుతున్నదో ఆప్రక్రియ ఎట్లు సాగుతున్నదో, దానిని మనస్సెందుకు కోరుకొంటుందో అవగాహన చేసికోకపోతేమీకు సంతుష్టి లభింపదు.

ఉదాహరణకు మీరొక పరీక్షలో తప్పిపోతే, ఆ పరీక్ష మళ్ళీ వ్రాయవలసివస్తుంది. ఏమి, వ్రాయవలసి రాదా? అసలు పరీక్షలనేవి, ఏ విధంగా చూచినా మిక్కిలి దురదృష్టకరమైనవి. అవి మహత్త్వపూర్ణమైన విషయాన్నిదేనినీ సూచించవు. మీ తెలివి తేటల నిజమైనవిలువను గూడ అవి తెలుపవు.పరీక్షలు పాసవడం ప్రధానంగా జ్ఞాపకశక్తిలోగల నేర్పు, అది దాని చమత్కారము.లేదా అది అదృష్టం మీద ఆధారపడిన విషయం. అయినా పరీక్షలు పాసవడానికి మీరు గట్టిగా ప్రయత్నిస్తారు. ఒకవేళ మీరందులో విజయం పొందకపోతేమళ్ళీ మళ్ళీ ప్రయత్నిస్తూనే వుంటారు.దైనిక జీవితంలో గూడ మనలో చాలమందికి అట్లే జరుగుతూ వుంటుంది. ఏదో యొక దానికోసం మనమెప్పుడూ ప్రయత్నిస్తూనేవుంటాము. కాని దేనికోసం మనమింత శ్రమ పడుతున్నామో అది అంత యెక్కువ శ్రమపడవలసినంత ముఖ్యమైన దాయని క్షణకాలమాగి విచారించము; అది శ్రమకు తగిన విలువ కలదేనాయని మనలో మనమెన్నడును ప్రశ్నించుకోము. అందువలన దానికి విలువలేదనే విషయాన్ని మనము తెలిసికొనలేకపోయినాం. అందుచేత మన తల్లితండ్రులు,మన సమాజము,మన గురువులు, పరమ గురువులు - వీరందరి అభిప్రాయాన్ని ఎదిరించి మనము నిలబడలేకపోయినాం. 'ఇంతకంటె అధికము' అనే మాటకు గల ప్రాధాన్యమును, దాని పూర్తి అర్థమును మనము బాగాగ్రహించినప్పుడే, విజయము - అపజయము, సాఫల్యము - వైఫల్యము - ఈ విధంగాఆలోచించడం మానివేయగలము.

పరీక్షలలోనే కాదు,జీవితంలో గూడ అపజయం పొందడమంటే, తప్పులు చేయడమంటేమనమెంతో భయపడతాం. తప్పుచేయడమంటే చాల భయకంకరమైన విషయంగా ఎంచబడుతుంది. ఎందుకంటే, దానికి మనలను విమర్శిస్తారు, తిడతారు. కాని మీరసలు తప్పు ఎందుకు చేయరాదు? ప్రపంచంలో అందరు తప్పులు చేయడం లేదా? మనమొకరం తప్పంటూ చేయకపోతే ప్రపంచ మీదారుణమైన గందరగోళ పరిస్థితి నుండి బయట పడుతుందా. మీరు తప్పులు చేయడానికి భయపడేటట్లయితే మీరెన్నటికిని నేర్చుకోలేరు. పెద్దవాండ్లు ఎప్పుడూ తప్పులు చేసత్తానే వుంటారు. కాని మీరు మాత్రం తప్పులు చేయకూడదని మందలిస్తుంటారు. ఈ విధంగా మీలో వుండే చొరవను అణగగొట్టివేస్తారు. ఎందువలన? వారి భయమేమిటంటే,మీరు ప్రతిదానిని పరిశీలిస్తూ, ప్రశ్నిస్తూ, పరీక్షించి చూస్తూ, తప్పులుచేస్తూ, తుదకు మీరు స్వయంగా తెలివిపొందినవారై, మీ తల్లితండ్రులు,సంఘము,సంప్రదాయములు అధికారమునుండి విడివడి తప్పించుకొని పోతారేమోయని వారి భయము.అందువల్లనే విజయము పొందడమనే ఆదర్శాన్ని మీ ముందు పెట్టి దానిని అనుసరించమని మీతో చెబుతారు. విజయము గౌరవ ప్రదమైనదిగా లెక్కింపబడడం మీరు గుర్తించగలరు. ఆఖరికి సన్యాసి గూడ తన ఆధ్యాత్మిక సాధనలనబడే వానిద్వారా గౌరవ ప్రదమైన స్థితిని పొందకపోతే, అతని నెవరును గుర్తించరు, అతని నెవరును అనుసరింపరు, అతనికి శిష్యులుండరు.

కాబట్టి మనమెల్లప్పుడును 'విజయము' 'సాఫల్య'మను పదములలోను 'ఇంతకంటె అధిక'నే పదములోను ఆలోచిస్తూ వుంటాము. గౌరవనీయమగు సమాజమే అధికమనే పదానికి విలువ కట్టుతుంది. అంటే, దానినే మరియొక విధంగా చెప్పితే, సంఘము చాల జాగ్రత్తగా ఆలోచించి ఒక మర్యాదను స్థిరపరుస్తుంది. దానిననుసరించి మీరు పొందినది జయమో అపజయమో నిర్ణయిస్తుంది. కాని మీరు ఏ పనైనా మనస్ఫూర్తిగా దానిమీద ప్రేమతో చేయగోరినట్లయితే అప్పుడు మీకు సాఫల్యములతో సంబంధము లేదు. తెలివిగల వ్యక్తి యెవరైనా సరే చేసేది అంతే. కాని దురదృష్టవశాత్తు తెలివిగల వ్యక్తులు, అంటే ప్రాజ్ఞులు చాల అరుదు. మీకీ విషయాలన్ని ఎవ్వరున్ను చెప్పరు. ప్రాజ్ఞుడు చేయవలసినదెల్ల యేమంటే ఉన్నవాస్తవాలను చూడడం సమస్యను అర్థం చేసి కోవడం-అంటేదాని భావం, సాఫల్యము, వైఫల్యము అనునిట్టి పదములలో ఆలోచించకుండడం.మనము చేసే పనిమీద మనకు ప్రేమ లేనప్పుడు మాత్రమే మన మీ సాఫల్య వైఫల్యమనే పదములలో ఆలోచిస్తాము.

*('ఈ విషయమై ఆలోచించండి, నుండి)*

# సంధ్యా సమయం-సుమ సౌందర్యం

పచ్చని ఆకులతో చిక్కగా వున్న గుబుర్ల మధ్యన కాస్తంత ఖాళీలో మూడే మూడు లేత గులాబీరంగు పూరేకులు గల కుసుమం ఒకటి వికసించి వున్నది. ఆకుపచ్చల్లో పొదిగి వున్నదా పూవు. తన సౌందర్యానికి అది కూడా అబ్బురపడిపోయే వుంటుంది. దట్టంగా పెరిగిన వృక్షజాలం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా తన మనుగడ కోసం ఎంతో ప్రయాసతో పైకి ఎదిగి వచ్చిన పొదకు పూచిన పూవు అది. బ్రహ్మాండంగా పెరిగిన వృక్షమొకటి ఆ పొదను కప్పేసి వుంది. అక్కడే వున్న అనేక ఇతర పొదలు కూడా తమ మనుగడ కోసం పోరాడుతున్నాయి. ఆ పొదకు చాలా పూలు పూచాయి. అయితే ఈ పూవు మాత్రం మరో పూవు తోడు లేకుండా ఆకుల మధ్యన ఒంటరిగా పూచింది. ఒక్కటే వుండటం వలన మరీ చకితపరుస్తున్నది. ఒక చిన్న గాలి తెర వచ్చి ఆకులను పూపేసింది. అయితే పూవును మాత్రం అది తాక లేదు. పూవు కదలకుండా ఒంటరిగా నిలబడి వున్నది. ఒంటరిగా వున్నది కాబట్టే ఆకాశం శూన్యంగా వున్నప్పుడు పొడిచిన ఒకే ఒక చుక్కలా వింత సౌందర్యంతో వెలిగిపోతున్నది. ఈ పచ్చనాకుల పందిరికి ఆవలగా కొబ్బరిచెట్టు మాను నల్లగా కనబడింది. నిజానికి అది నల్లగా లేదు.కానీ ఏనుగు తొండంలా కనబడింది. చూస్తూవుండగానే ఆ నలుపు పూలు పూచినట్లు గులాబీరంగులోకి మారిపోయింది. సాయంకాలపు సూర్యకిరణాలు వచ్చి దానిపై వాలడంతో వృక్షాగ్రభాగాలు అన్నీ మంటలందుకున్నాయి. చలనరహితంగా నిలిచి పోయాయి. గాలి వీచడం ఆగింది. అస్తమిస్తున్న సూర్యుని కాంతి ఆకుల పైన మచ్చలు మచ్చలుగా మిగిలిపోయింది. చెట్టు కొమ్మ మీద ఒక చిన్న పిట్ట ముస్తాబు చేసుకుంటున్నది. కాసేపు ఆపి, చుట్టూ తల తిప్పి చూసింది. అంతలోనే రివ్వున ఎగిరి సూర్యుని వైపుగా వెళ్ళిపోయింది.

*(నోట్‌బుక్ నుండి; 194 వ పుట)*

**మీ చిరునామా**
**మాకు వ్రాయండి.**
**'అంతరంగ యాత్ర'ను**
**ఉచితంగా పంపుతాము.**

# మన జీవితకాలమంతా భయంతోనే బ్రతికి, భయంతోనే చనిపోతాం

**మనుషుల్లో** చాలామందికి భయం వుంటుంది. అది భౌతికపరమైన భయం కావచ్చు, అంతర్గత సంబంధితమూ కావచ్చు. ఏదో ఒకదానితో సంబంధం వున్నప్పుడే భయానికి వునికి ఏర్పడుతుంది. నాకు అనారోగ్యం అంటే భయం. శరీరంలో బాధలు, నొప్పులు అంటే నాకు భయం. ఒకసారి నొప్పి కలిగింది. అదంటే నాకు భయం. ప్రజాభిప్రాయం అంటే నాకు భయం. ఈ ఉద్యోగం పోతుందని భయం. ఆశించిన చోటికి చేరుకోలేనేమో, సాధించలేనేమో, సఫలత అందుకోలేనేమో అనేభయాలు వుంటాయి. నాకు చీకటి అంటే భయం; నా మూర్ఖత్వం చూసి నాకే భయం, నా అల్పత్వం అన్నా భయమే.

ఇలా రకరకాలైన భయాలు ఎన్నో మనకి వున్నాయి. ఈ భయాలను విడివిడిగా చిన్న చిన్న ఖండాలుగా చేసి చూసి అలా ఆ భయాలను పరిష్కరించుకోవాలని ప్రయత్నిస్తుంటాం. అంతకంటె ఆవలగా మనం వెళ్ళలేక పోతున్నాం. ఏదో ఒక భయాన్ని మనం అర్థం చేసుకున్నాము, దానిని పోగొట్టుకున్నాము అని అనుకుంటే ఇంకేదో భయం పైకి లేస్తుంది. భయపడు తున్నాము అనే ఎరుక మనలో కలిగినప్పుడు ఆ భయం నుంచి దూరంగా పరుగెత్తి పోదామని ప్రయత్నిస్తాం.

మన మానవజాతికి మహాచాతుర్యం వుంది. వివిధ వివిధ రకాలైన పలాయనాలను మనం సిద్ధంచేసి పెట్టుకున్నాం. దేవుడు, వినోదాలు, మత్తుపానీయాలు, సెక్స్, ఇటువంటివే ఎన్నో. అన్ని పలాయనాలూ సమానమే. దేవుడి పేరు చెప్పుకున్నా, త్రాగుడైనా రెండూ ఒకటే. మానవుల్లాగా జీవించాలంటే మన ఈ సమస్యని ముందుగా పరిష్కరించుకొని తీరాలి, చేతన మానసంలోగాని, అచేతనంలో గాని భయం పెట్టుకొని జీవించడం అంటే అది అంధ కారంలో, విపరీతమైన అంతర్గత సంఘర్షణలో, ప్రతిరోధంతో జీవించడం అనమాట. భయం ఎక్కువైన కొద్దీ నరాలపై ఒత్తిడి పీడిస్తూ వుంటుంది. మతి చాంచల్యం ఎక్కువ వుతుంటుంది. పారిపోవాలనే కాంక్షా పెరుగు తుంది. అలా పారిపోకుండా వుంటే అప్పుడు, 'ఈ సమస్యను పరిష్కరించుకునేది ఎలా?' అని మనల్ని మనం ప్రశ్నించుకుంటాం. పరిష్కారం కోసం మార్గాలు, పద్ధతులు వెదకుతాం. అయితే, ఈ మార్గాల కోసం మనకు తెలిసిన సీమలో వెదకుతాం. ఏదో ఒకటి ఈ విషయంలో చేస్తాం. ఈ చర్య ఆలోచనలో పుట్టి పెరిగిన చర్య. అనుభవము, జ్ఞానము, తెలిసినది (జ్ఞాతము) అనే సీమ లోపలగానే ఈ చర్య వుంటుంది. అందుచేత సమాధానం లభించదు. ఇదీ మనం చేస్తున్న పని. అందుచేత భయంతోనే చచ్చిపోతాం. మన జీవితకాలమంతా భయంతోనే బ్రతికి, భయంతోనే చనిపోతాం. సరే, మానవుడు భయాన్ని, సమస్తమైన భయాన్ని సంపూర్తిగా నిర్మూలించుకోగలడా? ఏదైనా మనం చేయ గలమా? అసలు చేయగలిగినది ఏదీ లేదా? ఏదీ లేదు అంటే అర్థం భయాన్ని అంగీకరించామని, అది హేతు బద్ధమే అని ఆమోదించామని, దానితోనే జీవిస్తామనీ కాదు. మేము చెప్తున్న నిష్క్రియ అది కాదు. ఇప్పటివరకు భయం విషయంలో చేయవలసినవి అన్నీ చేశాము. విశ్లేషణ జరిపాం. వివరంగా చూశాం. ఎదుర్కోవాలని ప్రయత్నించాం. ప్రత్యక్షంగా తాకి చూశాం. ప్రతిరోధించాం. ఇలా సాధ్యమైనవన్నీ చేశాము. కాని భయం అలాగే వుండిపోయింది. భయం ఎడల సంపూర్ణమైన ఎరుకతో వుండటం సాధ్యపడుతుందా? కేవలం మేధను వుపయోగిస్తూ కాదు. వుద్రేక పడుతూనూ కాదు. పూర్తిగా దాని ఎడల ఎరుకగా వుండటం. అయినా కూడా దానిని గురించి ఏదీ చేయకుండా వుండి పోవడం సాధ్యమా? భయంతో మనం ప్రత్యక్ష స్పర్శ పెట్టుకోవాలి. కానీ మనం అది చేయం. భయం అనే ఆ మాటే భయానికి కారణం. అసలు వాస్తవంతో మనకు ప్రత్యక్ష సంబంధం లేకుండా చేస్తున్నది ఆ పదమే.

*(22 మే 1966, ప్యారిస్)*

# మనం ఏమిటో మనకి నిజంగా తెలుసా?

**ప్రశ్న:** స్వీయ జ్ఞానం గురించి మీరు అంతగట్టిగా నొక్కి చెప్తున్నారు. ఎందుకని? మేము ఏమిటో మాకు బాగానే తెలుసు కదా?

**కృష్ణమూర్తి:** మనం ఏమిటో మనకి నిజంగా తెలుసా అని నా సందేహం. మనము అంటే మనకి నేర్పించిన అనేక విషయాలు అని చెప్పచ్చు కదూ. మన గతం సమస్తముతో కలిసిన మొత్తమే మనం అంటే. మనం అంటే ఒక స్మృతుల మూట అని కూడా అనవచ్చు. అవునా? 'నేను దేవుడికే అంకితం' అనీ, 'స్వీయాత్మ' శాశ్వతం' అనీ ఇంకా అవీ ఇవీ మీరు అంటున్నప్పుడు అదంతా కూడా మీ నేపథ్యం, మీ పూర్వరంగం, మీ నిబద్ధీకరణం. కదూ? అదే విధంగా 'దేవుడు లేడు' అని ఒక కమ్యూనిస్టు అంటుంటే అతడు కూడా తన నిబద్ధతనే వ్యక్త పరుస్తున్నాడు.

"అవును, నేను అంటే ఏమిటో నాకు బాగా తెలుసు' అని అనడం కేవలం ఉపరితలంలో నుంచి అనే మాటలు. కానీ, మీ మొత్తం అస్తిత్వం అంటే ఒక స్మృతుల మూటే తప్ప మేరేమీ కాదు అనీ, మీ ఆలోచనలూ, మీ ప్రతిస్పందనలూ అన్నీ కూడా యాంత్రికమైనవి అనీ గ్రహించడం, నిజంగా తెలుసుకోవడం అంత సులభం కాదు. అంటే అర్థం ఏమిటంటే, చేతనా మానసం జరిపే పనుల ఎడలే కాకుండా, అచేతనంగా పడి వున్న అవశేషాలు, జాతి సంబంధిత అంశాల ముద్రలు, స్మృతులు, మనం నేర్చుకున్న విషయాలు-వీటి అన్నింటిఎడల కూడా ఎరుకగా వుండటం. అంటే, మనసు అనే మొత్తం క్షేత్రాన్ని, రహస్యంగా దాగి వున్న దానినీ, పైకి కనబడుతున్న దానినీ కూడా ఆవిష్కరించుకోవడం. ఇది అత్యంత కఠినమైన పని. నా మనసు అంటే కేవలం గతం మిగిల్చిన అవశేషమే అయితే, అది

☞6

# ప్రేమ మనసుకి సంబంధించినది కాదు

ప్రేమ విచిత్రమైనది. దాని వెచ్చని జ్వాలని ఎంత సులభంగా పోగొట్టుకుంటాం. జ్వాల పోతుంది, పొగ మిగులుతుంది. ఆ పొగ మన హృదయాల్లో మనసుల్లో నిండిపోయి ఉంటుంది. మన రోజులు కన్నీళ్ళతో కాఠిన్యంతో గడుస్తాయి. పాటని మరచిపోతాం మాటలకి అర్థం పోతుంది. పరిమళం పోతుంది. మన చేతులు ఖాళీగా ఉంటాయి. పొగ లేకుండా జ్వాలని ఎలా నిలుపుకోవాలో మన కెన్నటికీ తెలియదు. పొగ ఎప్పుడూ జ్వాలని ఆర్పేస్తుంది. ప్రేమ మనసుకి సంబంధించినది కాదు. ఆలోచన తయారు చేసిన వలలో వుండదు. దానిని వెతికి పట్టుకోవడం సాధ్యం కాదు. అలవరచుకోవడం, దాచుకోవడమూ సాధ్యం అవదు. మనసు మౌనంగా ఉన్నప్పుడు, మనసుకి సంబంధించిన విషయాలతో హృదయం ఆక్రమింపబడనప్పుడు ప్రేమ ఉంటుంది.

*(కమెంటరీస్ ఆన్ లివింగ్-2)*

(5వ పేజీ తరువాయి) . . .

## మనం ఏమిటో మనకి నిజంగా తెలుసా?

కేవలం స్మృతులు, నాటుకొని పోయిన ముద్రలు గల మూటే కనుక అయితే, చదువు అని మనం అంటున్న దాని చేత, రకరకాల ప్రభావాల చేత రూపుదిద్దుకున్నది మాత్రమే అయితే, అప్పుడు ఇదంతా కానిది ఏదయినా నాలో కొంత భాగమైనా వున్నదా? ఎందుకంటే నేను కేవలం పునరుక్తం చేసే ఒక యంత్రాన్ని కనుక అయితే, మనలో చాలామందిమి ఇటువంటి యంత్రాలమే – మనం నేర్చుకున్నదీ, మనం సేకరించుకున్నదీ మళ్ళీ మళ్ళీ పునశ్చరణం చేస్తూ, మనకు ఒకరు చెప్పినది ఇతరులకు అందజేస్తూవుంటాం. అటువంటప్పుడు, ఈ నిబద్ధీకృతమైన క్షేత్రంలో పుట్టుకొచ్చిన ఏ ఆలోచన అయినా మరికొంత నిబద్ధీకరణకే దారితీస్తుందని, మరికొన్ని బాధలకు, మరికొన్ని పరిమితులకు మాత్రమే దారితీస్తుందని అనడంలో సందేహం లేదు.

అందుచేత, మనసు తన పరిమితులు, తెలుసుకున్నాక, తన నిబద్ధీకరణం ఎడల ఎరుక చెందాక, తనను తాను మించి ఆవలగా పోగలుగుతుందా? అదీ సమస్య. పోగలదు అనో పోలేదు అనో గట్టిగా నొక్కి పలకడం మూర్ఖత్వం. మనసు సమస్తమూ నిబద్ధితమై వున్నది అనడంలో ఏమాత్రం సందేహం లేదు. మనం అందరమూ నిబద్ధులమై వున్నాం. కాలం అనే ప్రక్రియ ద్వారా సంప్రదాయము, కుటుంబము, అనుభవాలు మనలను నిబద్ధుల్ని చేశాయి. దేవుడిలో మీకు విశ్వాసం వుంటే కనుక ఒక రకమైన నిబద్ధతకి పర్యవసానంగా ఆ విశ్వాసం మీలో కలిగింది. అదేవిధంగా, దేవుడున్నాడని నాకు నమ్మకం లేదు అనే మనిషిలో వున్న అవిశ్వాసం కూడా అంతే. అందుచేత విశ్వాసానికి, అవిశ్వాసానికి పెద్ద ప్రాధాన్యం ఏమీ లేదు. అయితే ముఖ్యమైన అంశం ఏమిటంటే ఆలోచనా క్షేత్రం మొత్తాన్నీ అవగాహన చేసుకోవడం. మనసు దీనంతటినీ దాటి ఆవలగా పోగలదా అనేది చూడటం.

ఆవలగా పోవాలంటే మిమ్మల్ని మీరు తెలుసుకోవాలి. ఉద్దేశ్యాలు, అంతఃప్రేరణలు, ప్రతిస్పందనలు, మనవాళ్ళు మనకు నేర్పించినవి మనమీద చేసే బ్రహ్మాండమైన ఒత్తిడి, కలలు, సంకోచాలు, వ్యక్త మానసంలో వుండేవే కాకుండా లోపల దాగివున్నతీవ్రమైన వాంఛలు–ఇవి అన్నీ మీరు తెలుసుకోవాలి. అప్పుడు సంపూర్ణమైన నవ్యతతో వుండేదానిని, కాలం చేత ఎన్నడూ కలుషితం కాని ఒకదానిని ఆవిష్కరించుకో గలదా మనసు అని కనిపెట్టడం సాధ్యమవు తుందని నేను అనుకుంటున్నాను.

*('ఈ విప్లవం అంతరంగంలో' నుండి)*

# భద్రత కోసం ఆరాటం

ప్రతి ఒక్కరికీ జీవితంలో భద్రత కావాలి. అది సహజమే. ఆహారం, దుస్తులు, ఇంటి వసతి కావాలనుకోవడం ఒక సహజమైన స్పందన. ప్రపంచంలో నివసిస్తున్న ప్రతి మనిషికీ, ఎంతో పామరుడు అయినా, మహా నవ నాగరీకుడు అయినా అందరికీ భౌతికమైన భద్రత, ఆంతరికమైన భద్రత రెండూ కావాలి. సురక్షితంగా వుండాలని అందరూ కోరుకుంటారు. అయితే ఈ విభజనల వలన, దేశదేశాలుగా ఈ విభజించు కోవడం వలన ఆ భద్రత లభించదు. బయట చూస్తే యుద్ధాలు. మరో దేశం, మరో సిద్ధాంతవాదం మిమ్మల్ని బెదిరిస్తూ వుంటుంది. అందుచేత మిమ్మల్ని రక్షించుకోవాలనుకుంటారు. విభజన ద్వారానే ఆ భద్రత లభిస్తుందనుకుంటున్నాం. రాజకీయ వాదులూ, నాయకుల మంటూ తిరిగే వారూ కూడా అదే అంటున్నారు. కుటుంబంలో భద్రత ఉన్నదనుకుంటాం. అట్లాగే దేశంలో. దేశం అంటే ఆటవిక తెగలకే పెట్టిన ఒక గొప్ప పేరు. ప్రత్యేక వ్యక్తిత్వంలో భద్రత దొరుకుతూందనుకుంటాం. కుటుంబంలో, అదే విధంగా రకరకాలైన విభజనల శాఖోపశాఖల్లో భద్రత లభిస్తుందనుకుంటాం. అయితే పుస్తకాల్లో చదవడం ద్వారా, మేధాబుద్ధి ద్వారా కాకుండా, నిజంగానే యధార్థ జీవితంలో, నిత్యజీవనంలో విభజనవున్న చోట సంఘర్షణ వుండి తీరుతుందని మనకే తెలిసిపోతుంది. ఇది సహజ సూత్రం. ఒక స్త్రీకి, ఒక పురుషుడికి మధ్య, భార్యాభర్తల మధ్య ఇంకా అటువంటి వారి మధ్య కనుక విభజన వుంటే అక్కడ వారి మధ్య సంఘర్షణ కూడా వుండి తీరుతుంది. అది అంతే. అందుచేతనే ఈ దేశంలో, మరికొన్ని దేశాలలో పెద్ద సంఖ్యలో విడాకులు తీసుకుంటున్నారు. ప్రతివారికీ తాము చెప్పినట్లే జరగాలి. ప్రతివారూ తమని తాము పూర్తిగా అభివ్యక్తం చేసుకోవాలి. ఇదంతా మానసిక శాస్త్రజ్ఞులు చేస్తున్న పని. "మీకేది కావాలోఅది చేయండి, అణచుకోకండి..." అని వాళ్ళు చెప్తుంటారు.

*(శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రసంగం; 1983, ఏప్రిల్ 30)*

# సన్యసించనూ వద్దు సమ్మతించనూ వద్దు

తనను తాను లోతుగా అర్థం చేసుకోవడానికి ఎవరికైనా సమతుల్యత అవసరం. అంటే, సంసారాన్ని పరిత్యజిస్తే నన్ను నేను అర్థంచేసుకోగలుగుతానని ఆశిస్తేనూ లాభం లేదు. సంసారంలో పూర్తిగా చిక్కుకొని పోతేనూ నన్ను నేను అవగాహన చేసుకోవడానికి అవకాశం వుండదు. సమతుల్యంగా వుండాలి. సన్యసించనూ వద్దు. సమ్మతించి లొంగిపోనూ వద్దు.

*(ది కలెక్టెడ్ వర్క్స్, 3వ సంపుటి, 22వపుట)*

*Published in August, December & April* Periodical

*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*

*If undeliverd please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org

*Published by G. Rajeev on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65)Greenways Road, Chennai - 600 028.*
*Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*